## ఇసుక వినియోగం ఫుల్.. ఆదాయం నిల్

**గనుల శాఖపై సమీక్షలో సీఎం**

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇసుక వినియోగం పెరుగుతున్నా, ఖజానాకు రావాల్సిన ఆదాయం మాత్రం రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, గనుల శాఖపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏ విధంగా సరఫరా చేయాలనే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యయన కమిటీ సభ్యులుగా ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌ను నియమించారు. వారంలోపు విధి విధానాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. రాష్ట్రంలో ఏటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి ఆశించినంత ఆదాయం రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే కొనుగోలు చేయాల్సి వస్తున్నదని సీఎం తెలిపారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చూడటంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్లలో వివక్ష

**వాణిజ్య పన్నులశాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నిరసన**

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రమోషన్లలో తమపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట వాణిజ్య పన్నుల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కే భీక్యా, ప్రధాన కార్యదర్శి కే నాగేందర్, సహ అధ్యక్షుడు బీ శ్యామ్, గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

# అక్షరాలు పలకలేరు.. పదాలు చదువలేరు

- కూడికలు రావు.. తీసివేతలు చేయలేరు
- ఎనిమిదో తరగతిలో ఉన్నా.. రెండో తరగతి పాఠాలు చదువలేరు
- రాష్ట్రంలో దిగజారుతున్న విద్యాప్రమాణాలు
- ఆందోళన వ్యక్తంచేసిన అసర్-2024 నివేదిక
- సీఎం విద్యాశాఖ మంత్రిగా ఉన్నా కనిపించని మార్పు



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : మూడో తరగతిలోని విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలను ఎంత మంది చదవగలరంటే కేవలం 6.8శాతం మాత్రమే. 2018లో చదివేవారి శాతం 12.6గా ఉంటే, 2022లో 6.3శాతానికి పడిపోగా, 2024కు వచ్చేసరికి 6.8శాతానికి పరిమితమయ్యింది. అన్ని రాష్ట్రాలతో పోల్చితే ఇదే అత్యల్పం. ఈ విషయంలో బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల కన్నా తెలంగాణ వెనుకబడి ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని అన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్-2024లో వెలుగు చూసింది. ఇండియా రూరల్ పేరుతో అసర్ సంస్థ రిపోర్టును మంగళవారం విడుదల చేసింది. మూడో తరగతి విద్యార్థులు 7.8శాతం మంది అక్షరాలను చదవలేని స్థితిలో ఉన్నారు. 26.5శాతం విద్యార్థులు అక్షరాలు చదివినా పదాలను ఉచ్ఛరించలేరు. 41.3శాతం మంది పదాలను చదువగలరు.. కానీ ఒకటో తరగతి పుస్తకాలను చదవలేని స్థితిలో ఉన్నారు. మరో 18.3శాతం మంది ఒకటో తరగతి పుస్తకాలు చదివినా రెండో తరగతి పుస్తకాలను చదవలేని స్థితిలో ఉన్నారు. ఇక కూడికలు రాని.. తీసివేతలు చేయలేని స్థితిలో విద్యార్థులున్నట్టు ఈ నివేదిక తెలిపింది. రాష్ట్రంలో 13 నెలలుగా విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేరు. సాక్షాత్తు సీఎం విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. స్వయంగా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకంగా విద్యాకమిషన్‌ను నియమించి అధ్యయనం చేయిస్తున్నారు. కానీ ఈ ఏడాది కాలంలో విద్యావ్యవస్థలో మార్పులు రాకపోగా, మరింతగా దిగజారడం గమనార్హం. సీఎం రేవంత్‌రెడ్డియే విద్యాశాఖ మంత్రిగా ఉండటంతో ఏదో చేసేస్తారు.. ఎంతో కొంత మార్పు ఉంటుందని అంతా అనుకున్నారు. కానీ ఇదంతా ఉత్తదేనని ఈ నివేదికతో తేటతెల్లమయ్యింది.

### నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..

- మూడో తరగతి విద్యార్థుల్లో కేవలం 29శాతం మంది మాత్రమే తీసివేత (గణితం)చేయగలరు. ఐదో తరగతిలో 23.9శాతం మంది మాత్రమే భాగహారం (డివిజన్) చేయగలరు.
- ఐదో తరగతి చదువుతున్న వారిలో రెండో తరగతి పాఠాలు చదవగలిగేవారు కేవలం 29.3శాతమే. 8వ తరగతి విద్యార్థుల్లో రెండో తరగతి పాఠాలు చదివేవారి శాతం 50.8శాతమే.
- 8వ తరగతిలోని వారు భాగహారం (డివిజన్) చేయగలిగిన వారి శాతం 38.5 మాత్రమే. 2018లో వీరి శాతం 43.0శాతముండగా, 2022లో 40.2శాతముగా ఉంది. అంటే రెండేండ్లల్లో రెండుశాతం విద్యార్థులు భాగహారం చేయలేని స్థితిలో ఉన్నారు.
- రెండో తరగతిలో ఉండి.. రెండో తరగతి పాఠాలను ఎంత మంది చదవగలరంటే సర్కారు బడుల్లో 6.8శాతముండగా, ప్రైవేట్‌లో 5.4శాతమే.
- ఐదో తరగతి విద్యార్థుల్లో భాగహారం చేయగలిగిన వారి వివరాలను పరిశీలిస్తే సర్కారు బడుల్లో 23.9శాతం, ప్రైవేట్‌లో 27.5శాతం మాత్రమే. 8వ తరగతి విద్యార్థుల్లో భాగహారం చేయగలిగిన వారు 38.5శాతమే.
- రాష్ట్రంలో సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరుశాతం క్రమంగా పడిపోతున్నది. 2018లో 74.5శాతం, 2022లో 75.5శాతం నమోదుకాగా, 2024కు వచ్చేసరికి 73.5శాతానికి పడిపోయింది.
- టీచర్ల హాజరుశాతం సైతం సమస్యగా మారింది. కేవలం 85.5శాతం టీచర్లు మాత్రమే బడులకు హాజరవుతున్నారు.

# సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ

- తొలిసారి దళిత నేతకు రాష్ట్ర పార్టీ పగ్గాలు
- 60 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీ ఏర్పాటు
- తమ్మినేని, చెరుపల్లి, డీజీకి దక్కని అవకాశం



హైదదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంగారెడ్డిలో జరిగిన సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు పార్టీ రాష్ట్ర కార్యదర్శితోపాటు కార్యవర్గాన్ని, కమిటీని ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన జాన్ వెస్లీ.. గతంలో డీవైఎఫ్ఐ, కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. సీపీఎం నూతన రాష్ట్ర కార్యవర్గం 60 మందితో ఏర్పాటైంది. వీరిలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా జీ నాగయ్య, ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, టీ జ్యోతి, టీ సాగర్, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్, పీ ప్రభాకర్, నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్‌ను మహాసభ ఎన్నుకున్నది. 70 ఏండ్లు దాటిన నేతలకు రాష్ట్ర కమిటీ నుంచి వీడ్కోలు పలికారు. దీంతో తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, డీజీ నర్సింహారావుకు రాష్ట్ర కమిటీలో అవకాశం దక్కలేదు. వీరిని సెంట్రల్ కమిటీకి తీసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

### తొలిసారిగా దళితులకు పదవి

దేశంలో కమ్యూనిస్టు పార్టీ చరిత్రలోనే తొలిసారిగా తెలుగు రాష్ట్రాల్లో దళిత నేతకు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కింది. ఇప్పటి వరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శులుగా అగ్రవర్ణాలకు చెందిన వారే పనిచేశారు. తెలంగాణ ఏర్పాటు నుంచి మూడుసార్లు ఆ పార్టీకి నాయకత్వం వహించిన తమ్మినేని వీరభద్రం ఈ మహాసభల్లో రిలీవ్ అయ్యా రు. దీంతో ఈసారి జాన్‌వెస్లీకి అవకాశం దక్కింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి లేదా సీఐటీయూ నాయకుడు ఎస్ వీరయ్య ఎన్నికవుతారని భావించారు. అయితే ఈ అంచనాలు తారుమారు చేస్తూ జాన్‌వెస్లీకి బాధ్యతలు అప్పగించారు.

### బీజేపీని రాజకీయంగా ఎండగట్టాలి

తెలంగాణలో బీజేపీ విధానాలను రాజకీయంగా ఎండగట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, అనుసరించాల్సి వ్యూహంపై రాజకీయ తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ గ్యారెంటీల అమలుపై పోరాటం చేయాలని నిర్ణయించారు.

# ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి చెక్!

- స్థానిక రాజకీయాల నుంచి తప్పించే ప్రయత్నం
- ఉత్తర తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిల్చోవద్దని ఒత్తిడి
- విద్యావేత్తకు టికెట్ ఇచ్చేందుకు ప్రయత్నాలు
- కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ మార్కు రాజకీయాలు ఊపందుకున్నాయి. రెండుమూడు రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్నదనే వార్తల నేపథ్యంలో సీనియర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని స్థానిక రాజకీయాల నుంచి తప్పించేందుకు కుయుక్తులు పన్నుతున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు గుత్తాధిపత్యం కట్టబెట్టడానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. అందులో భాగంగా జీవన్‌రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ రాకుండా అడ్డుకునేందుకు ఢిల్లీ అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.



### తిరుగుబాటు మీద రివెంజ్

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిలతోపాటు బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎంఐఎం నుంచి ఎన్నికైన రియాజ్ ఉల్ హసన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనున్నది. వీటిలో ఉత్తర తెలంగాణ పట్టభద్రుల స్థానం, కరీంనగర్, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ స్థానం కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. జీవన్‌రెడ్డి ముఖ్యనేత మీద తిరుగుబాటు చేస్తుండటం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన్ను ప్రత్యక్ష రాజకీయాలకు దూరం చేయనున్నట్టు తెలుస్తున్నది.

### జీవన్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని తీర్మానం

ఇటీవల పీసీసీ సమావేశం నిర్వహించగా.. సభ్యులందరూ జీవన్‌రెడ్డి పేరునే ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిసింది. తాము ఒకటి తలిస్తే.. సభ్యులు మరొకటి తలవడంతో కంగుతిన్న పీసీసీ నేతలు సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారని తెలిసింది.

### అనూహ్యంగా తెరమీదకి విద్యావేత్త

జీవన్‌రెడ్డికి చెక్ పెట్టేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ విద్యావేత్త పేరు అనూహ్యంగా తెరమీదికి వచ్చింది. భారీ మద్దతు తనకున్నదని పేర్కొంటూ ఆయన ఏఐసీసీ పెద్దలను కలవడంతోపాటు పీసీసీ మద్దతు కోరినట్టు తెలిసింది. రూ.100 కోట్ల వరకు ఖర్చు చేస్తానని హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది.

## ఎక్సైజ్ లక్ష్యాలను సాధించండి

- ఆబ్కారీ డైరీ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రతి ఉద్యోగి నిబద్ధత, బాధ్యతతో పనిచేసి ఎక్సైజ్ శాఖ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఆబ్కారీ భవన్‌లో మంగళవారం తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసీజర్‌ను తయారు చేసుకొని సమర్థతను పెంచుకోవాలని, తద్వారా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పదోన్నతులు, బదిలీలు తదితర అంశాలను మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యలు న్యాయ సమ్మతమైనవని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు.

# అబుల్ కలాం విగ్రహ ఏర్పాటుపై రగడ

- ఓ వర్గంపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆగ్రహం
- సోషల్ మీడియాలో వైరల్



ఓ వర్గం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, జనవరి 28 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ జూనియర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు విషయంలో రగడ రాజుకుంది. ఈ విగ్రహం ఏర్పాటుకు గతంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమి పూజ చేశారు. ఇక్కడే రోడ్డు మధ్య డివైడర్‌లో ఇతర సంఘాలకు చెందిన పలు విగ్రహాలు ఉన్నాయి. ఈ విగ్రహాన్ని సైతం వాటి మాదిరిగానే ఏర్పాటు చేయాలని కొందరు సూచించగా.. సంబంధిత వర్గం నాయకులు మాత్రం ప్రతిపాదించిన స్థలంలోనే విగ్రహం పెట్టాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మరో నాయకుడికి మధ్య చర్చ జరిగింది. సమావేశం అనంతరం ఓ వర్గానికి చెందిన నాయకులు విగ్రహం ఏర్పాటుపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. 'ముందు ఆ వర్గం నాయకుడే మొదలు పెట్టిండు. ఏదైనా మాట్లాడితే వైరల్ చేసి భయపెట్టాలని చూస్తున్నారా? మీకు అంత దమ్మొంటే అతడిని శిక్షించండి. అలాంటి వారితోనే మంచి పనులు కరాబ్ అవుతాయి. నేను చట్ట ప్రకారమే వెళ్తాను' అంటూ వాహనంలో వెళ్లిపోయారు. కించపరిచేలా ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోషల్ మీడియాలో ఓ వర్గంవారు పెట్టిన వీడియో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

# ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే

- కాలయాపన చేస్తే 6న మహాదీక్ష
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ హెచ్చరిక

ముషీరాబాద్, జనవరి 28: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే ఫిబ్రవరి 6వ తేదీన మహాదీక్ష చేపడతామని హెచ్చరించారు. విద్యానగర్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని అసెంబ్లీలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులోనే బిల్లు పెట్టేదని, అలా కాకుండా రాష్ట్రాలకు అప్పగించి చేతులు దులిపేసుకున్నదని మండిపడ్డారు. మంద కృష్ణ మాదిగకు వర్గీకరణ ఇష్టం లేనట్లుందని, అందుకే వర్గీకరణ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా చావుడప్పు కొడతామని ప్రటించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు రమేశ్, గణేశ్, శ్రీనివాస్, హుస్సేన్, శ్రీను పాల్గొన్నారు.

## మాలలపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**మంద కృష్ణమాదిగకు మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య హితవు**



ఖైరతాబాద్, జనవరి 28 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాలలపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జీ చెన్నయ్య హితవు పలికారు. లేకుంటే తమ సత్తా ఏమిటో చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు మాలలకు దక్కాల్సిన ఫలితాలన్నీ మాదిగలే అనుభవించారని ఆరోపించారు. వర్గీకరణ ఆగదని ఒకసారి, మాలలే అడ్డుకుంటున్నారని మరోసారి మా ట్లాడడం తగదని, మంద కృష్ణకు దమ్ముంటే ప్రధానితో ఒప్పించి పార్లమెంటులో బిల్లు పెట్టించుకొని వర్గీకరణ అమలుచేయించుకోవాలని సూచించారు. ఆయన మాదిగ వర్గాలకు నాయకుడిగా కాకుండా, బీజేపీకి తొత్తుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మాలలపై చావుడప్పు కొడుతానంటున్న మంద కృష్ణ.. ముందుగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టని బీజేపీ అధిష్టానంపై కొట్టాలని ధ్వజమెత్తారు. సమావేశంలో చెరుకు రాంచందర్, కరణం కిషన్ పాల్గొన్నారు.

# జూన్‌లోనే పంచాయతీ ఎన్నికలు!

- పథకాలపై నిలదీతలతో సర్కారులో డైలమా
- ప్రతికూల ఫలితాలు తప్పవనని భయం
- పథకాల అమలు తర్వాతే పెట్టే యోచన

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం డైలమాలో పడ్డట్టు తెలుస్తున్నది. ఇటీవల జరిగిన గ్రామసభల్లో జనం నుంచి వచ్చిన తీవ్ర నిరసనలతో వెనక్కి తగ్గిందని సమాచారం. ప్రతికూల ఫలితాలు తప్పవని భావిస్తున్నదని, పథకాల అమలు తర్వాతే నిర్వహించేందుకు సిద్ధమైందని తెలిసింది. ఈ మేరకు వచ్చే జూన్ లేదా జూలైలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకే మొగ్గు చూపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల జరిపితే ఎదురయ్యే పరిణామాలు, వాయిదా వేస్తే తలెత్తే ఇబ్బందులపై అధికార పార్టీ పెద్దలు తాజాగా చర్చోపచర్చలు చేస్తున్నట్టు వినికిడి. కొంతకాలంగా త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ సీఎంతోపాటు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పదే పదే ఊదరగొట్టారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఈ నిర్ణయంపై వెనక్కి తగ్గినట్టు సమాచారం. గ్రామసభల్లో అనేక చోట్ల ప్రజల నిలదీతలు, డెడికేషన్ కమిషన్ నివేదికపై ముందుకెళ్లే విషయంలో అయోమయం నెలకొనడంతో సర్కారు సందిగ్ధంలో పడిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రతికూల ఫలితాలు వస్తాయనే భయంతోనే అధికార పక్షం వెనుకడుగు వేస్తున్నదని భావిస్తున్నారు. జనవరి 26న ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసిన తర్వాతే ఎన్నికల నిర్వహణ దిశగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నట్టు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే పథకాల అమలుకు మార్చి 31 వరకు గడువు విధించిందని పేర్కొంటున్నారు.

### మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు

మార్చి 31 తర్వాత ఎన్నికలు నిర్వహించాలనుకున్నా సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడంలేదు. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమై ఏప్రిల్‌లో 4 వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత ఏప్రిల్‌లో ఇంటర్, డిగ్రీ పరీక్షలు, మే నెలలో వివిధ ప్రవేశ పరీక్షలు ఉన్నాయి. మరోవైపు ఎండాకాలంలో సహజంగానే నీటి ఎద్దడి, కరెంట్ కోతలు ఇతర సమస్యలు ప్రతిపక్షాలకు ప్రధాస్త్రాలుగా మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో మే తర్వాతే అంటే జూన్, జూలైలో ఎన్నికలు నిర్వహించే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

### అధికారపక్షంలో నిస్తేజం

స్థానిక ఎన్నికల నిర్వహణపై అధికార కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యంగా ఈ విషయంలో మంత్రుల మధ్యే సఖ్యత లేదని చెప్తున్నారు. పథకాల అమలు ఊపులోనే ఎన్నికలకు వెళ్తే ఫలితం ఉంటుందని కొందరు పట్టుబడుతున్నారని తెలుస్తున్నది. లేదంటే పార్టీ క్యాడర్‌లో నిస్తేజం అలుముకుంటుందని వారంటున్నారని వినికిడి. సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయంగా తీవ్రంగా నష్టం జరుగుతుందని మరికొందరు చెప్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం అయోమయంలో పడ్డట్టు తెలుస్తున్నది.

### జోష్‌లో ప్రధాన ప్రతిపక్షం

అధికార కాంగ్రెస్‌లో నిరుత్సాహం కనిపిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌లో జోష్ కనిపిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాల నుంచి వెంటనే తేరుకొని పార్టీ నేతలు కార్యక్షేత్రంలోకి అడుగుపెట్టారు. నిత్యం జనంతో మమేకమవుతూ వారి సమస్యలపై పోరాడుతూనే ఉన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, కవిత నాయకత్వంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, హామీల అమలుపై నిత్యం నిలదీస్తున్నారు. ముఖ్యంగా రైతుధర్నాల పేరిట అన్నదాతలకు భరోసానిస్తూ పార్టీ ముందుకెళ్తున్నది. పార్టీ ఏ పిలుపునిచ్చినా రాష్ట్రవ్యాప్తంగా అనూహ్య స్పందన వస్తుండటంతో అటు క్యాడర్‌లో, లీడర్లలో జోష్ కనిపిస్తున్నది. వెరసీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉన్నది.

## ఆధునిక టెక్నాలజీతో జైళ్ల నిర్వహణ

**జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా**

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): జైళ్ల నిర్వహణలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నట్టు జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రీట్రీట్ లో ఆమె మాట్లాడుతూ.. 2002 నుంచి రీట్రీట్ జరుగుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చర్లపల్లి, కరీంనగర్, ఖమ్మం జైళ్ల వార్డర్లు, డిప్యూటీ జైలర్లకు రెండ్రోజులపాటు రీట్రీట్ నిర్వహస్తున్నట్టు చెప్పారు. డ్రగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు, జైళ్ల శాఖ సిబ్బంది, ఖైదీల సంక్షమంపై చర్చించనున్నట్టు తెలిపారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. జైళ్ల ఆధునీకరణ, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు, ఎస్ఐసీఏ శిక్షణ నిధులు, ఐఎల్ఎల్ బిల్లుల మంజూరు, చర్లపల్లి సెంట్రల్ జైలులో కొత్త బ్యారక్‌ల నిర్మాణానికి నిధులు విడుదల చేసినట్టు వెల్లడించారు. జైళ్ల శాఖ ఐజీలు రాజేశ్, మురళీబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ పాల్గొన్నారు.


## కొమురవెల్లిలో అఘోరి హల్‌చల్

- దిగంబరంగా అనుమతించలేమని ఆలయ వర్గాల స్పష్టీకరణ
- కత్తితో భక్తులపైకి దూసుకెళ్లి.. ద్వారాన్ని పగులగొట్టే యత్నం
- చివరికి స్వామివారిని దర్శించుకొని వెళ్లిన అఘోరి

చేర్యాల, జనవరి 28 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో మంగళవారం అఘోరి హల్‌చల్ చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఆమె ఆలయ ప్రధాన ద్వారం నుంచి దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దిగంబరంగా అనుమతి ఇవ్వలేమని, వస్త్రాలు ధరించి రావాలని ఆలయవర్గాలు సూచించడంతో బయటకు వచ్చి కారులో ఉన్న కత్తి తీసుకుని భక్తులపై దూయడంతో ఒక్కసారిగా వారు పరుగులు తీశారు. పోలీసులు చేరుకుని ఆమెను శాంతింపజేసేందుకు యత్నించారు. వినకుండా ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వెళ్లి తలుపులకు ఉన్న తాళాన్ని పగులగొట్టేందుకు యత్నించి విఫలమయ్యారు. వీడియో తీస్తున్న మీడియా ప్రతినిధిని కత్తితో అడ్డుకోవడంతో సెల్‌ఫోన్ పగిలిపోయింది. ఆలయవర్గాల విజ్ఞప్తితో అఘోరి వస్త్రాలు ధరించి వచ్చి స్వామివారిని దర్శించుకుని వెళ్లిపోయారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతలు

- ఏపీ మాజీ ఎమ్మెల్యే కాటసానికి సంబంధించిన ఫెన్సింగ్ తొలగింపు
- కాలనీవాసుల ఫిర్యాదుతో హైడ్రా అధికారుల చర్యలు
- గతంలోనే ప్రహరీ, ఫెన్సింగ్ తొలగించిన హైడ్రా బృందం
- మళ్లీ ఫిర్యాదుతో మరోసారి కూల్చివేతలు చేపట్టిన సిబ్బంది



హైదరాబాద్ సిటీబ్యూరో/పటాన్‌చెరువు, జనవరి 28(నమస్తే తెలంగాణ)/పటాన్ చెరు/ అమీన్‌పూర్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. అమీన్‌పూర్ పద్మావతి లేఅవుట్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మరికొందరు కలిసి వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం హైడ్రా సిబ్బంది తొలగించారు. పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారంటూ బాధితుల ఫిర్యాదు మేరకు ఈ ఫెన్సింగ్‌ను కూలగొట్టారు. సర్వే నంబర్ 193,194, 323లోని 24 ఎకరాల స్థలంలో నిర్మించిన ప్రహరీని గతంలోనే హైడ్రా కూల్చేయగా.. తిరిగి అదే స్థానంలో ఫెన్సింగ్ ఏర్పాటుచేసి తమ ప్లాట్లకు చేరుకోవడానికి వీలులేకుండా చేస్తున్నారంటూ పద్మావతీనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సమీప గ్రామాల ప్రజలు హైడ్రాకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అక్కడ ఉన్న ప్రహరీతో పాటు ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ ఆక్రమణలపై ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ వాసులు, బందంకొమ్ము ప్రాంతం ప్రజలు ఫిర్యాదులు చేశారు.

### సిస్ల లోహిత్‌ను ప్రోత్సహించొద్దు

24 ఎకరాల్లో వేసిన లేఔట్‌లో 293 ప్లాట్లు చేశారని ప్లాట్ల యజమానులు మీడియా ఎదుట తెలిపారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సిస్ల లోహిత్ తమ ప్లాట్లను కబ్జా చేసి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సిస్ల లోహిత్ ఆంధ్ర సీఎం చంద్రబాబు వెంట ఉంటాడని, ఆంధ్రావారి ప్లాట్లు కబ్జా చేస్తున్న లోహిత్‌ను బాబు ప్రోత్సహించొద్దని బాధితులు కోరారు.

### స్వాధీన స్థలాల్లో హైడ్రా బోర్డులు

ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, పార్కుల స్థలాల ఆక్రమణలను తేల్చి కూల్చేసిన స్థలాల్లో 'ప్రొటెక్టెడ్ బై హైడ్రా' అని బోర్డులు పెట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న స్థలాల్లో ప్రభుత్వ స్థలం అని ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించి ఆక్రమిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీంతో హైడ్రా ప్రొటెక్షన్‌లో ఉన్నట్టుగా బోర్డులు పెట్టాలని సూచించారు.

# ఆర్టీసీ సమ్మెపై సర్కారులో అలజడి

- స్థానిక ఎన్నికల ముందు హైరానా
- ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుందని ఆందోళన
- ఎలక్ట్రిక్ బస్సులు, కార్మికుల డిమాండ్లపై మల్లగుల్లాలు
- సీఎస్, కార్మికశాఖ కమిషనర్, రవాణాశాఖ ప్రత్యేక కార్యదర్శులకు సమ్మె నోటీసులిచ్చిన ఆర్టీసీ జేఏసీ




హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికుల సమ్మె నోటీసుతో సర్కారులో అలజడి మొదలైంది. నాలుగు పథకాలు మొదలుపెట్టి, స్థానిక ఎన్నికల నుంచి గట్టెక్కుదామనుకున్న తరుణంలో ఈ తలనొప్పి ఏమిటని హైరానా పడుతున్నది. ఇప్పటికే పథకాల అమలుకు నిధుల లేమితో కిందామీద పడుతున్న పరిస్థితుల్లో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చడమెలా? అనే అంశంపై తర్జనభర్జన పడుతున్నది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యం. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించడం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యేలాలేదు. 43 వేల మంది కార్మికులు సమ్మె చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడాల్సి వస్తుంది. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల నుంచి వ్యతిరేకత, గ్రామీణ పేదలు, చిరుద్యోగులు అష్టకష్టాలపాలయ్యే అవకాశం ఉండగా, ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఉంటుందని ఆందోళనకు గురవుతున్నది. ఆర్టీసీ సమ్మెతో ప్రభుత్వ లొసుగులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం అవుతాయనే భయం ప్రభుత్వాన్ని వెంటాడుతున్నది.

### నాడు ఓట్ల కోసం హామీలు

నాడు ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఏడాదైనా అమలు దిశగా అడుగు ముందుకు వేయలేదు. పలుసార్లు ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో కార్మికుల్లో అసంతృప్తి పెరిగిపోయింది. దీనికి తోడు ఆర్టీసీ ఎండీ వ్యవహార శైలి కార్మికులకు మింగుడు పడటంలేదు. సంక్రాంతికి ముందే సమ్మె నోటీసు ఇవ్వాలని భావించినప్పటికీ, పండుగ సమయంలో సమ్మెకు వెళ్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని కార్మిక సంఘాలు భావించాయి. ఆర్టీసీకి లాభాలొస్తున్నాయని సీఎం, మంత్రులు పదే పదే చెప్తూనే కార్మికులకు అందాల్సిన ఏరియర్స్ ఇవ్వకపోవడంతో ఆర్టీసీ సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. సోమవారం ఆర్టీసీ యాజామాన్యానికి నోటీసులిచ్చిన ఆర్టీసీ జేఏసీ నేతలు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి, కార్మికశాఖ కమిషనర్ సంజయ్‌కుమార్, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌కు నోటీసులిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, ప్రతినిధులు కమలాకర్, కృష్ణ, సుద్దాల సురేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు. సమ్మె నోటీసులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాబోయే రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

## ఫిబ్రవరిలో 'గేట్'

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : జాతీయంగా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ ఇన్ ఇంజినీరింగ్ టెస్ట్ (గేట్)కు రంగం సిద్ధమయ్యింది. ఫిబ్రవరి 1, 2 15, 16 తేదీల్లో రోజుకు రెండు చొప్పున మొత్తం 8 సెషన్లల్లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది గేట్‌ను ఐఐటీ రూర్కీ నిర్వహిస్తున్నది. 8 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, సీఎస్ఈ పేపర్‌కు హాజరయ్యేందుకు 1.6లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు కానున్నారు. రాష్ట్రంలో 11 పట్టణాల్లో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్, మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. గేట్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా ఎంఎస్, ఎంటెక్ కోర్సుల్లో చేరడానికి వీలుంటుంది. అంతే కాకుండా మూడేండ్లపాటు 32 కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగాల ఇంటర్వ్యూలకు ఈ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.